www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 5 మార్చి 2023



లక్ష్యం మేరకు ఆస్తి పన్ను వసూళ్లు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు ఆస్తిపన్ను వసూళ్లు చేపట్టాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం నగరపాలక కార్యాలయంలో పన్నుల వసూళ్లపై సహాయ కమిషనర్ గోవర్ధన్, ఆర్వో, ఆర్ఐలు, వార్డు అడ్మిన్ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ అన్ని వార్డు పరిధిలో ఆస్తిపన్ను వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. ప్రధానంగా పాత బకాయిలు పూర్తి స్థాయిలో వసూలు చేయాలని, అధిక మొత్తంలో ఆస్తిపన్ను బకాయిపడ్డవారి ఆస్తులకు సంబంధించి సత్వరం నోటీసులు జారీ చేయాలన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పూర్తిస్థాయిలో పన్నులు వసూళ్లు చేపట్టాలని, ఇందుకోసం ఆర్ఐలు, అడ్మిన్ కార్యదర్శులు రోజువారి, వారాంతపు లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేయాలన్నారు. వార్డుల వారీగా ఆస్తి పన్ను డిమాండ్, వసూళ్ల పాత బకాయిలపై సంబంధిత ఆర్ఐలు, అడ్మిన్ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. సహాయ కమిషనర్ గోవర్ధన్, ఆర్వో గోపాలకష్ణ వర్మ, ఆర్ఐలు, వార్డు అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉద్యోగ ఉపాధ్యాయులపై ప్రభుత్వ నిర్బంధం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్, పలమనేరు

సిపిఎస్ రద్దు చేసి, ఒపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డెక్కిన ఉద్యోగ ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధకాండ ప్రదర్శించడమే కాకుండా, బెదిరింపులకు పాల్పడుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. అర్థంలేని యాప్‌ల పేరుతో వేధింపులకు గురిచేస్తుందన్నారు. శనివారం చిత్తూరు యుటిఎఫ్ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు అధ్యక్షతన, మధ్యాహ్నం పలమనేరు గుడిసత్రంలో నాయకులు ఓబుల్‌రాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. ప్రకాశం , నెల్లూరు, చిత్తూరు జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈసారి పిడిఎఫ్ ఉద్యమ అభ్యర్థులు మీగడ వెంకటేశ్వర్ రెడ్డి, పి.బాబురెడ్డి పోటీ చేస్తున్నారన్నారు. గతంలో పిడిఎఫ్ ఎంఎల్‌సిలుగా ఉన్న వారు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, కాంట్రాక్టు కార్మికులకు బాసటగా నిలుస్తూ వారి గళాన్ని శాసనమండలిలో వినిపించారన్నారు. వారి సమస్యలపై నిరంతరం పోరాడారన్నారు. గతంలో మూడుసార్లు పిడిఎఫ్ అభ్యర్థులను పట్టభద్రులు, ఉద్యోగులు, కార్మిక సంఘాలు, మేధావులు గెలిపించడం వల్లనే వారి సమస్యలను వినిపించడానికి శాసనమండలి వేదికయ్యిందన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, నాయకులు సురేంద్ర, పి.చైతన్య పాల్గొన్నారు. పలమనేరులో నాయకులు ఓబుల్‌రాజు, భువనేశ్వరి, అన్నూరి ఈశ్వర్, నాగేశ్వరరావు, చెన్నకేశవులు, సుబ్రమణ్యం, మంజునాథ్, జయంతి పాల్గొన్నారు.

గడువు దగ్గరపడుతోంది..

- ఉగాదికి సామూహిక గృహ ప్రవేశాలు
- అనేక ప్రాంతాల్లో అసంపూర్తిగానే ఇళ్లు..

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా గృహనిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వైఎస్ఆర్ గృహకల్ప పేరుతో జగనన్న కాలనీలను ఏర్పాటు చేసి అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేసింది. ఇండ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలంటూ లబ్ధిదార్లను ఆదేశించినా... గృహనిర్మాణాల కోసం ప్రభుత్వం రుణం ఏమాత్రం సరిపోకపోవడంతో గృహనిర్మాణాలను పూర్తిచేసేందుకు లబ్ధిదార్లు సుముఖంగా లేరు.

ఏడాదిలో ఎన్నికల సమీపిస్తుండటంతో ప్రభుత్వం శరవేగంగా ఇండ్ల నిర్మాణాలను పూర్తిచేయాలనే లక్ష్యంతో తొందరపెడుతున్నా ఆమేరకు క్షేత్రస్థాయిలో గృహనిర్మాణాలు పూర్తికావడం లేదనేది వాస్తవం. ఇప్పటికే వాయిదాలు పడుతున్న గృహప్రవేశాలకు మరోసారి గడువు విధించారు. ఏది ఏమైనా ఏప్రిల్‌లో వచ్చే ఉగాది నాటికి సామూహిక గృహప్రవేశాలకు సిద్ధంకావాలని అధికార్లకు ఆదేశాలు అందడంతో గృహనిర్మాణశాఖపై ఒత్తిడి పెరుగుతోంది. ఆ మేరకు గృహ నిర్మాణాలు పూర్తి చేయాలంటూ లబ్ధిదార్లపై గృహ నిర్మాణాశాఖ అధికారులు ఒత్తిడి పెంచారు.

పేదలందరికీ ఇండ్లు అంటూ ఇల్లు లేని లబ్ధిదార్లను గుర్తించి పట్టాలు పంపిణీ చేసి రెండేళ్ళు గడుస్తున్నా నేటివరకు జగన్న కాలనీల్లో సగానికి పైగా పునాదులు, మొడి గోడలే దర్శనం ఇస్తున్నాయి. ఈ ఏడాది సంక్రాంతి రోజున సామూహిక గృహప్రవేశాలకు ముహుత్తం ఖరారు చేసినా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు ఇండ్ల నిర్మాణాలు పూర్తికాకపోవడంతో ఉగాది నాటికి వీలైనంత వరకు గృహనిర్మాణాలను పూర్తిచేసి సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం చేసేందుకు ప్రభుత్వ అధికారులు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. అధికార్ల ఒత్తిడితో గృహనిర్మాణాలు పూర్తిచేద్దామన్నా జగన్న కాలనీల్లో మౌళిక వసతుల సమస్య వెంటాడుతోంది. నిర్మాణం కోసం నీటి కోసం ట్యాంకర్‌కు రూ.6 నుంచి 7 వందలు ఖర్చు చేయాల్సి వస్తోంది. మరో వైపు కొండలు, గుట్టల్లో ఇండ్ల స్థలం మంజురు చేయడంతో కొందరు ఆసక్తి చూపకపోవడంతో పునాదులు వేసేందుకు ముందుకు రావడం లేదని గృహనిర్మాణాశాఖ అధికారులే చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం లక్ష్యం మేరకు గృహనిర్మాణాలు పూర్తికాకుంటే సామూహిక గృహప్రవేశాలు మరో మారు వాయిదాపడక తప్పేలా లేదు.



అసంపూర్తిగా ఉన్న గృహనిర్మాణాలు

జిల్లా నియోజవర్గాల వారిగా ఇండ్లు మంజురు ఇలా...

చిత్తూరు జిల్లాలో జగన్నన కాలనీల పేరుతో ప్రభుత్వం రెవెన్యూ అధికార్ల ద్వారా 72,272 ఇంటి స్థలాలు ఇల్లు లేని పేదలకు మంజూరు చేసింది. నియోజకవర్గాల వారీగా చూస్తే కుప్పం 5,562, చిత్తూరు 9,749, జీడినెల్లూరు 12,505, నగరి 4,599, పలమనేరు 12,131, పుంగనూరు 15,665, పూతలపట్టు 12,061 మంజూరు చేసింది. ప్రభుత్వలక్ష్యం మేరకు ఈ ఏడాది ఉగాది నాటికి 65 నుంచి 70 శాతం ఇండ్ల నిర్మాణాలు పూర్తికావాలని క్షేత్ర స్థాయిలో 40 శాతానికి మించి కాన్నట్లు సమాచారం. ప్రభుత్వం మంజురు చేసిన గృహ నిర్మాణరుణం పెంచాలని లబ్ధిదార్లు కోరుతున్నారు. అలాగే మౌళిక వసతులైన నీరు, డ్రైనేజీ, విద్యుత్, రోడ్లు వంటి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.



పునాదులకే పరిమితమైన ఇళ్ల నిర్మాణాలు

సమస్యలు వింటూ... భరోసా ఇస్తూ..!

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ముగిసిన 'యువగళం' పాదయాత్ర

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ప్రజాదృష్టి

టిడిపి యువనేత చేపట్టిన 'యువగళం' పాదయాత్ర శనివారానికి 34వ రోజుకు చేరుకుంది. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ముగించుకుని ఆదివారం అన్నమయ్య జిల్లా పీలేరులోకి ఈ యాత్ర అడుగు పెట్టనుంది.. జనవరి 27న కుప్పంలో ప్రారంభించిన ఈ యాత్ర అదే ఉత్సాహంతో పుంగనూరు నియోజకవర్గంలోనూ కొనసాగింది.. 'సైకో పోవాలి.. సైకిల్ రావాలి' అంటూ రహదారుల కూడళ్లలో యువత డ్యాన్సులు ఉత్సాహాన్ని నింపాయి.. రోజుకు 10-15 కిలోమీటర్ల దూరం యాత్ర సాగుతూ వచ్చింది. జగన్‌పైన విమర్శలు చేయడంతోనే కాకుండా, బీసీలతోనూ, మైనార్టీలతోనూ, ఆయా సామాజికవర్గాలతోనూ మమేకమవుతూ వారి సమస్యలను సావధానంగా వింటూ 'మేమున్నాం మీకు అండగా' అంటూ భరోసా ఇస్తూ యాత్ర సాగింది. ప్రారంభంలో తారకరత్నకు హార్ట్‌స్ట్రోక్ రావడం, కొన్నాళ్లు బెంగుళూరులోని ఆస్పత్రిలో చికిత్స పొంది మృతిచెందడం వల్ల చోటుచేసుకున్న విషాదం మినహా మిగిలిన అన్ని రోజులూ నారా లోకేష్ యాత్రలో ఎక్కడా 'అలసట' అనేది కనిపించకుండా యాత్ర సాగింది.

అడుగడుగునా అధికార పార్టీ అడ్డగింపులు, పోలీసుకేసులు షరా మామూలుగానే సాగాయి.

యాత్ర ఆద్యంతం ప్రతి ఒక్కరితో మమేకం అవుతూ, వారి బాధలను నింపాదిగా వింటూ, అనంతరం టిడిపి అధికారంలోకి వస్తే ఏం చేస్తామో వివరిస్తూ యాత్ర కొనసాగింది. యాత్ర ప్రారంభంలో పెట్రోల్, డీజిల్ సంబంధించి రాష్ట్రంలో భారాన్ని సరిహద్దు ప్రాంతంలో స్వయంగా వాహనానికి పెట్రోల్ పట్టించి రాష్ట్ర ప్రభుత్వ దోపిడీని వివరించే ప్రయత్నం చేశారు. రోజా ఇంటికి 'సారె' తీసుకెళ్లేందుకు మహిళలను ఆటోలో ఎక్కించుకున్నందుకు హమీద్‌బాషా ఆటోను వైసిపి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. దీంతో ఆటో డ్రైవర్ హమీద్‌బాషాకు కొత్త ఆటోను స్వయంగా ఇచ్చారు. నారా లోకేష్ ఎదుట వైసీపీ ప్రభుత్వంను విమర్శించిందన్న నేపథ్యంలోనే శ్రీకాళహస్తి పట్టణ రాజీవ్‌నగర్‌లో హోటల్ నిర్వాహకురాలు రజకురాలు మునిరాజమ్మపై కొందరు వైసీపీ నేతలు ఉద్దేశ పూర్వకంగా దాడి చేసి ఎదురు కేసు పెట్టారు. ఈ నేపథ్యంలో శనివారం మంగళగిరిలో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ఐదు లక్షల ఆర్థిక సాయాన్ని బాధితురాలికి అందజేశారు. శనివారం కల్లూరులో మైనార్టీలతో ముఖాముఖి సందర్భంగా పలమనేరుకు చెందిన విద్యార్థి మిస్బా తల్లిదండ్రులు వజీర్ అహ్మద్, నసీమాలు నారా లోకేష్‌ను కలిసారు. వైసిపి నాయకుల వేధింపుల వల్లే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని కన్నీరుమున్నీరయ్యారు. ఈ సందర్భంగా నారా లోకేష్ స్పందిస్తూ టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మిస్బా ఆత్మహత్యకు కారణమైన వైసిపి నాయకుడు సునీల్‌ను శిక్షిస్తామన్నారు. నారా లోకేష్ పాదయాత్ర ఆద్యంతం బీసీలు, మైనార్టీలతో మమేకమవుతూ కనిపించారు. టిడిపి మళ్లీ అధికారంలోకి వస్తే ఆదరణ పథకాన్ని పునఃప్రారంభిస్తామని, మైనార్టీలకు రిజర్వేషన్ కల్పించి, ఇస్లామిక్ బ్యాంకులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. రైతులతో మాట్లాడుతూ రాయలసీమకు కృష్ణా, గోదావరి జలాలను తెప్పించి ప్రతి ఎకరాకు నీరు అందిస్తామన్నారు. ఉచితంగా డ్రిప్ ఇరిగేషన్ ఇస్తామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు సిపిఎస్ రద్దు చేసి, ఒపిఎస్ తీసుకురావాలని స్వయంగా నారా లోకేష్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చినప్పటికీ స్పష్టమైన హామీ ఇవ్వకపోవడం గమనార్హం.



మత్స్యకారులతో...

నీటిశుద్ధీకరణ ప్లాంట్ పనులు పూర్తి చేయాలి

నగర కమిషనర్ అరుణ



అడవిపల్లి రిజర్వాయర్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న నగర కమిషనర్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరానికి శాశ్వత తాగునీటి సరఫరా పథకానికి సంబంధించిన డబ్ల్యూటీపీ (నీటి శుద్ధీకరణ ప్లాంట్) నిర్మాణ పనులను నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ పరిశీలించారు. శనివారం ఉదయం కమిషనర్ పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి దామలచెరువు వద్దనున్న అడవిపల్లె రిజర్వాయర్, డబ్ల్యూటీపి (నీటి శుద్ధీకరణ ప్లాంట్) నిర్మాణ పనులను పరిశీలించారు. అమత్ పథకంలో భాగంగా చిత్తూరు నగరానికి శాశ్వత తాగునీటిని సరఫరా కోసం రూ.271కోట్లతో జరుగుతున్న పనులను పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును ఇంజనీరింగ్ అధికారులు, కేఎల్ఎస్ఆర్ ఏజెన్సీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. అడవిపల్లె రిజర్వాయర్ నుంచి గ్రావిటీ ద్వారా నీటిని డబ్ల్యూటీపీ సరఫరా చేస్తారు. ఇక్కడ నీటిని శుద్ధిచేసి పైపులైన్ ద్వారా చిత్తూరు నగరానికి తీసుకొస్తారని, నగరంలోని పైపులైను పనులు వేగంగా జరుగుతున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు వివరించారు. పనులను రాబోయే ఆరు నెలల్లో పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఎస్ఈ సి.గోపాల్ రెడ్డి, డీపీహెచ్ఈవో పుష్పగిరి నాయక్, ఏఈ విష్ణువర్ధన్ రెడ్డి, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

10న మరోమారు శిక్షణ : జెసి

కౌంటింగ్ మాన్యువల్ అర్థం చేసుకోవాలి



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: శాసనమండలి ఎన్నికలు ఈనెల 13న జరగనున్న నేపథ్యంలో 16న నిర్వహించే కౌంటింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు కౌంటింగ్ నిర్వహణపై కౌంటింగ్ పర్సనల్స్ పూర్తి అవగాహన ఏర్పరుచుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శనివారం జిల్లా ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 16న ప్రకాశం- నెల్లూరు- చిత్తూరు పట్టభద్రుల, ఉపాధ్యాయుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల కౌంటింగ్ సిబ్బందిగా విధులు నిర్వర్తించేందుకు ఎంపిక చేసిన వారికి ఏఆర్ఓ, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్ పర్యవేక్షణలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ నిష్పక్షపాతంగా కౌంటింగ్ ప్రక్రియను నిర్వహించేందుకు భారత ఎన్నికల సంఘం వారి ఎన్నికల నియమావళిపై రూపొందించిన మాన్యువల్‌ను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకొని పూర్తి అవగాహనను ఏర్పరుచుకోవాలని అన్నారు. ఈనెల 10వ తేదీన మరోమారు ఆర్‌విఎస్ కాలేజీలో శిక్షణ తరగతులను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఏఆర్ఓ, డిఆర్ఓ మాట్లాడుతూ శాసలిమండలి ఓట్ల లెక్కింపు ప్రక్రియకు విధులు కేటాయించిన అధికారులు కౌంటింగ్ మ్యానువల్‌పై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఓట్ల లెక్కింపులో భాగంగా ప్రాథమికంగా మొదట పోస్టల్ బ్యాలెట్ అనంతరం బ్యాలెట్ పేపర్లను కట్టగాకట్టి పోలింగ్‌స్టేషన్‌ల వారీగా డ్రమ్స్ ఇన్చార్జికి అప్పగించిన తరువాత పోస్టల్ బ్యాలెట్ పేపర్లు, పోలింగ్ స్టేషన్స్ వారీగా కట్టలుకట్టిన బ్యాలెట్ పేపర్లును మొత్తం కలిపి అభ్యర్థుల వారీగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందన్నారు. కౌంటింగ్ మాన్యువల్‌లోని ప్రతి లైన్‌ను క్షుణ్ణంగా చదివి కౌంటింగ్ పర్సనల్స్ అర్థం చేసుకోవాలని తెలిపారు. ఈ శిక్షణాతరగతులలో తిరుపతి డిఆర్ఓ శ్రీనివాసరావు, జడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, చిత్తూరు, నగరి, కుప్పం, పలమనేరు, మదనపల్లె, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, గూడూర ఆర్డీఓలు రేణుకా, సుజన, శివయ్య, మురళి, చంద్రముని రాణార్, రామారావు, కిరణ్ కుమార్, జిఎస్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కోదండ రామిరెడ్డి, కౌంటింగ్ పర్సనల్స్ అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ మెటీరియల్ అందజేత

శనివారం సాయంత్రం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రకాశం- నెల్లూరు- చిత్తూరు పట్టభద్రుల ఉపాధ్యాయుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి ఈ నెల 13న జరగనున్న పోలింగ్ నిర్వహణలో భాగంగా పోలింగ్ మెటీరియల్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్, ఎఆర్ఓ, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్, పోలింగ్ మెటీరియల్ పంపిణీ నోడల్ ఆఫీసర్, జెడ్పి సిఈఓప్రభాకర్ రెడ్డితో కలిసి ఆర్‌డిఓలు, తహశీల్దార్‌లకు పోలింగ్ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎఓ కులశేఖర్, చిత్తూరు ఆర్డీఓ రేణుక, తహశీల్దార్లు పాల్గొన్నారు.

అంధకారంలో యువత భవిష్యత్తు

'యువగళం' పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఉద్యోగాలు లేక, ఉపాధి లేక యువత భవిష్యత్ అంధకారంలో ఉందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. టిడిపి తెచ్చిన కంపెనీలను జగన్‌రెడ్డి నిలబెట్టి ఉంటే ఈ రెండేళ్లలో రెండు లక్షల మందికి ఉద్యోగాలు వచ్చేవని, కానీ తరిమేశాడని విమర్శించారు. ఇదిలాగే కొనసాగితే ఏపీ యువత కేరాఫ్ అడ్రస్సు తెలంగాణా, కర్నాటక, తమిళనాడు, చివరకు ఉత్తరప్రదేశ్ కూడా అయ్యే ప్రమాదం ఉందన్నారు. యువగళం పాదయాత్ర 34వ రోజు శనివారం 14.2 కిలోమీటర్లు సాగింది. పుంగనూరు నియోజకవర్గం కొక్కువారిపల్లి విడిది కేంద్రంనుంచి పాదయాత్ర ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యింది. దేవళంపేటలో, తుడుంవారిపల్లిలో, కల్లూరులో మాటామంతీ, ముఖాముఖి నిర్వహించారు. కల్లూరులో భోజన విరామం. సాయంత్రం ముస్లింలతో, హమాలీలతో మాటామంతీ నిర్వహించారు. జ్యోతినగర్ విడిది కేంద్రంలో రాత్రి బస చేయనున్నారు. 34రోజులుగా పాదయాత్ర చేస్తున్నానంటే యువత ఉత్సాహమే కారణమన్నారు. దుష్టపాలనను రాష్ట్రం నుంచి తరిమేయాలనే ఉద్దేశ్యంతో తాను యువగళం ప్రారంభించినట్లు చెప్పారు. ఫాక్స్‌కాన్ అనే కంపెనీ మన రాష్ట్రం నుంచి వెళ్లిపోయి తెలంగాణాకు చేరిందని, అక్కడ లో మందికి ఉద్యోగాలు ఇస్తోందన్నారు. తాజాగా కర్నాటక రాఉంతోనూ ఈ కంపెనీ ఒప్పందం చేసుకుందన్నారు. జేట్యాక్స్ కోసం వేధించి ఒక్కో సంస్థను రాష్ట్రం నుంచి జగన్‌రెడ్డి తరిమేస్తున్నారన్నారు. అక్రమ కేసులకు భయపడొద్దని, పోరాడిన యువతకు పెద్దపీట వేస్తామన్నారు. కుప్పం, పలమనేరుకు పరిశ్రమలు వచ్చాయని, కానీ పుంగనూరుకు పరిశ్రమలు రాలేదంటే ఎంఎల్‌ఏ పెద్దిరెడ్డికి నియోజకవర్గ ప్రజలపై ఎంత చిన్నచూపో ఆలోచించాలన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే ఏపీ నుంచి పక్క రాష్ట్రానికి వలసలు వెళ్లడాన్ని అరికట్టి, పక్క రాష్ట్రం నుంచి ఏపీకి వలసలు వచ్చేలా చేస్తామన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగేళ్లుగా యువత భవిష్యత్ అంధకారంలో ఉందన్నారు. భవిష్యత్ బాగుండాలంటే చంద్రబాబు సిఎం కావాలన్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. పిఇటి రవికిషోర్ మాట్లాడుతూ పిల్లల్లో క్రీడాస్ఫూర్తి లేదని, ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. లోకేష్ మాట్లాడుతూ బాబు విద్య, ఉద్యోగాలు తెస్తే, జగన్ పాలనలో పాఠశాలల వద్దకే గంజాయి తెచ్చారన్నారు. ఈ విషయమై తాను మాట్లాడితే తిరుపతి ఎస్పి భుజాలు తడుముకున్నాడన్నారు. గంజాయికి ఏపీ అడ్డాగా మారిపోయిందన్నారు. చివరకు పదో తరగతి విద్యార్థులను గంజాయి సప్లయర్లుగా మార్చేశారన్నారు. చంద్రగిరిలో ఓ యువతిని గంజాయికి బానిసగా చేశారన్నారు.

మైనార్టీలతో ముఖాముఖి సందర్భంగా పలమనేరుకు చెందిన మైనార్టీ అమ్మాయి మిస్బా వైసిపి నేతల వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంది. ఆమె తల్లిదండ్రులు వజీర్ అహ్మద్, నసీమాలు నారా లోకేష్‌ను కలిసారు. మిస్బాకు చెందిన మార్కుల లిస్టులు, డ్రాయింగ్ పుస్తకాలు, సర్టిఫికేట్లను లోకేష్‌కు చూపించారు. వైసిపి నాయకులు టీసి ఇప్పించి, తమ కుమార్తె చదువుకు అడ్డుపడ్డారని వాపోయారు. దాన్ని తట్టుకోలేకే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని కన్నీరుమున్నీరయ్యారు. ముస్బాను మానసికంగా వేధించిన వైసిపి నాయకుడు సునీల్‌పై తాము అధికారంలోకి వచ్చిన వెంటనే శిక్షిస్తామని లోకేష్ హామీ ఇచ్చి ఓదార్చారు.

'దిశ' వాహనంతో నారా లోకేష్ సెల్ఫీ



'గంజాయి మోహన్ ఇంటి దగ్గరే అంధురాలైన దళిత యువతిని గంజాయి మత్తులో ఒకడు దారుణంగా నరికేస్తే అప్పుడు దిశ పోలీసులూ, దిశ వాహనం రాలేదు. దిశ చట్టం లేకపోయినా రంగులు వేసి, పేర్లు పెట్టిన దిశ వాహనాలలో పోలీసులు ఇదిగో ఇలా నా దగ్గర మైకు లాక్కోవడానికి నా వెంట తిరుగుతున్నారు. పుంగనూరు నియోజకవర్గం కొత్తపేట దగ్గర నన్ను ఫాలో అవుతున్నారు' అని దిశ వాహనాన్ని చూపుతూ నారా లోకేష్ సెల్ఫీ తీసుకున్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పిల్లలకు బాల్యంలోనే విద్యాబుద్ధులు అలవాటు చేసి వారిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే మహత్తర కార్యాన్ని అంగన్వాడీ టీచర్లు నిర్వర్తిస్తున్నారని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి ఐ.కరుణ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక కొంగారెడ్డిపల్లిలో స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఐసిడిఎస్ కార్యాలయంలో అలాగే గిరింపేట జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా అంగన్వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సివిల్‌జడ్జి మాట్లాడుతూ ఈనెల 4వ తేదీ నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను జరుపుకుంటున్నామని తెలిపారు. మహిళా చట్టాలపై మహిళలకు అవగాహన అవసరమన్నారు. దేశంలో మహిళల రక్షణ కొరకు ఎన్నో చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు జరుపుకోవడం కారణంగా మహిళల్లో చైతన్యం తీసుకువచ్చి సమాజంలో వారిని ముందుకు నడిపించడానికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు.

ప్రతి మహిళా నల్సా యాప్ డౌన్లోడ్ చేసుకోవాలి

ప్రతి మహిళా (నల్సా) జాతీయ న్యాయ సేవఅధికార సంస్థ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని జిల్లా న్యాయ సేవఅధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ.కరుణ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం జిల్లా న్యాయ సేవఅధికార సంస్థ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిమహిళా నల్సా యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 8న ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఈనెల 4 నుంచి 11వ తేదీ వరకు మహిళ వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మహిళ వారోత్సవాలు ప్రతి ఇంటి ముంగిట నిర్వహించాలని అన్నారు. జిల్లాలోని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థతో పాటుగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 13 మండలాల్లోని మండల న్యాయ సేవఅధికార సంస్థ ఆధ్వర్యంలో నల్సా యాప్‌లో గ్రీవెన్స్‌ను అప్లోడ్ చేయవచ్చునని తెలిపారు.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి



ప్రజాశక్తి-సోమల: 5 సంవత్సరాల లోపు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా తల్లిదండ్రులు వేయించాలని జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు తెలిపారు. సదుం మండలం చెరుకు వారి పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది కూడా చొరవ చూపి ప్రతి చిన్నారికీ టీకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే వడ్డిపల్లి, సోమల, నంజంపేట తదితర ప్రాంతాలలో వైద్య సిబ్బంది అంగన్‌వాడీ సెంటర్లలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉదయ భాస్కర్, నీలకంఠ, వైద్య సిబ్బంది భాగ్యలక్ష్మి, శ్రావణి, రేవతి, అంగన్‌వాడీ టీచర్ అనసూయ పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ ప్రజలకు వరం



ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: టిడిపి ప్రవేశపెట్టిన అన్నా క్యాంటీన్‌తో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు వరం లాంటిదని మండల టిడిపి అధ్యక్షుడు స్వామిదాస్ అన్నారు. మండలంలోని జంగాలపల్లె గ్రామంలో సీనియర్ టిడిపి నేత మణిరెడ్డి కుమారుడు లోకేష్ రెడ్డి , వినీతశ్రీకి కొత్తగా పెళ్ళి అయిన సందర్భంగా, శ్రీరంగ రాజపురం మండలం క్షీరసముద్రం గ్రామానికి చెందిన నరేష్ నాయుడు పుట్టినరోజు సందర్భంగా శనివారం పలువురు టీడీపీ నేతలతో కలిసి అన్న క్యాంటీన్‌లో అన్నదాతలు మణిరెడ్డి, నరేష్ నాయుడులతో పాటు టీడీపీ నేత స్వామిదాస్ కలిసి 200మంది పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు సోమసుందర్ రెడ్డి, గొల్లపల్లి నరసింహనాయుడు, జాన్, సుబ్రమణ్యం, బుజ్జిబాబు, ప్రకాష్, శంకర్ , కమల్, రాజేంద్రన్ పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



ప్రజాశక్తి-రొంపిచెర్ల: మండల ప్రాథమిక అరోగ్య కేంద్రాన్ని చిత్తూరు జిల్లా డిపిఎంవొ డాక్టర్ శ్రీనివాసులు శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పెద్ద మల్లెల కస్పా, కుమ్మరపల్లి, గుండ్లూరివారిపల్లి గ్రామాలలో నిర్వహించే వ్యాక్సిన్ కారియర్‌ను, మందుల శీతలీ కరణను పరిశీలించారు. దీంతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. టీకాలు వేయు సూదులు సరిపడా ఉన్నాయా, లేవా అనిన పరిశీలించారు. తదనంతరం 104, ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాంలను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. మండల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ రాజా, 104 డాక్టర్ ముకేష్, మండల ఆరోగ్య వైద్యాధికారి ఎం. రాజేశ్వరి, పీహెచ్ఎం పార్వతమ్మ, సూపర్‌వైజర్ పంకజ, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల పోలింగ్ కేంద్రం పరిశీలన



ప్రజాశక్తి-పాలసముద్రం: జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల స్థానిక పోలింగ్ కేంద్రాన్ని శనివారం తహశీల్దార్ బాబు, ఎస్ఐ బి సురేష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో విద్యుత్, తాగు నీరు వంటి మౌలిక వసతులను పరిశీలించారు. ఓటును వినియోగించుకోవడానికి వస్తున్న పట్టభద్రులకు ఎలాంటి ఆటంకం కలగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో సాధు, మండల సర్వే కిరణ్ కుమార్, ఉపాధ్యాయుడు ధనరాజ్ పాల్గొన్నారు.

బీఆర్‌డీ హాస్పిటల్‌లో అరుదైన శస్త్ర చికిత్స



ప్రజాశక్తి-కుప్పం: స్థానిక బిఆర్‌డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో శనివారం డాక్టర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో వైద్యులు అరుదైన మోకాలి శస్త్ర చికిత్స దిగ్విజయంగా పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలోని బిఆర్‌డి హాస్పిటల్‌లో పేద ప్రజలకు తక్కువ ధరలతో వైద్యం అందిస్తున్నారు. ఇందులో భాగంగానే ఈ శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసి రోగికి సంతోషాన్నిచ్చారు.

నేటి నుంచి వరదరాజస్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-పలమనేరు: రూరల్ మండలం కూర్మాయి పంచాయతీలో వెలిసిన శ్రీ కూర్మ వరదరాజ స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి గురువారం వరకు 5 రోజులు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ఆర్ వెంకట రామారెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు ధ్వజారోహణం కార్యక్రమంతో ప్రారంభమై గురువారం వసంతోత్సవంతో ముగుస్తుందని తెలిపారు. భక్తాదులందరూ పాల్గొని స్వామివారి కపకు పాత్రులు కాగలరని ఓ ప్రకటనలో తెలిపారు.

రోడ్డుపై ఒరిగిన చెరకు ట్రాక్టర్



ప్రజాశక్తి-నగరి: లోడుతో నెలవాయి షుగర్ ఫ్యాక్టరీకి వెళ్తూ చెరకులోడు ఒరిగి పోవడంతో ట్రాక్టర్ రోడ్డుపై వాలిపోయిన సంఘటన మున్సిపల్ పరిధి పళ్లిపట్టు రోడ్డులో శనివారం చోటుచేసుకుంది. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చెరకు ట్రాక్టర్‌ను పక్కకు తప్పించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు.

స్టాఫ్ నర్స్‌ను నియమించండి..!



ప్రజాశక్తి-యాదమరి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్స్‌ను నియమించకపోవడంతో అదనపు పనులతో ఎఎన్ఎంలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పిలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యాదమరి సంతగేటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మండల కేంద్రం పరిధిలో ఉండడంతో చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల నుండి రోజూ 150 నుండి 200 మంది వివిధ సమస్యలపై ప్రజలు పెద్ద ఎత్తున వైద్యం కోసం వస్తున్నారు. ఇక్కడ గత రెండు నెలల క్రితం స్టాఫ్ నర్స్ పోస్ట్ ఖాళీ అయింది. ఇక్కడ ఇంకో స్టాఫ్ నర్స్‌ని నియమించకుండా క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఆరోగ్య కార్యకర్తలను, ఎంఎల్‌హెచ్‌పిలను ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు డ్యూటీ వేస్తున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో మాకు కేటాయించిన గ్రామాల్లో క్షేత్రస్థాయిలో తాము ప్రజలకు అందించాల్సిన వైద్య సేవలు, రికార్డు వర్కులు నిలిచిపోతున్నాయని ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నత స్థాయి అధికారులకు పలుమార్లు విన్నవించినా వారు పట్టించుకోవడంలేదు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలంటూ శనివారం ఉదయం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏపీ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణకు సిబ్బంది వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ క్షేత్రస్థాయి సిబ్బందికి ఉదయం 10 గంటలకు సచివాలయాల్లో బయోమెట్రిక్ హాజరువేయాలన్నారు. అలాగే వారు ఏ గ్రామానికి వెళుతున్నారనేది మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో నమోదు చేసి వెళ్లాల్సి ఉందన్నారు. ఎంఎల్‌హెచ్‌పిలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం వరకు హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో ఉంటూ ఓపీ చూడాలన్నారు. మధ్యాహ్నానంతరం ఒక్కోరోజు ఒక్కో గ్రామాన్ని సందర్శించి దీర్ఘకాలిక రోగుల వద్దకు వెళ్లి వారికి చికిత్స అందించాలన్నారు. అనంతరం ఈ సేవలన్నింటినీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో డిఎం అండ్ హెచ్‌ఒ సూచనల మేరకు మెడికల్ ఆఫీసర్ ఓపీ డ్యూటీ వేశానని చెప్పడం ఎంతవరకు సమంజసమని లక్ష్మీనారాయణ ప్రశ్నించారు. ఈ విషయమై సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌ను కలిసి యూనియన్ తరపున వినతిపత్రం అందించడం జరుగుతుందని ఆయన చెప్పారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డ్యూటీలు వేయరాదని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ నుండి ఆదేశాలు ఉన్నాయని అయితే ఎలా డ్యూటీలు వేస్తారని ఆయన ప్రశ్నించారు.

స్టాఫ్ నర్స్ నియమించుకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతాం: యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్స్‌ను నియమించకుంటే జిల్లా వ్యాప్తంగా యూనియన్ సభ్యులతో డిఎం అండ్ హెచ్‌ఒ కార్యాలయం ఎదుట నిరసన చేస్తామని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బొమని లక్ష్మీనారాయణ హెచ్చరించారు. సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి మీకు న్యాయం చేస్తామని యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పనిచేస్తున్న ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పిలకు లక్ష్మీనారాయణ హామీ ఇచ్చారు.

వంట గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి



ప్రజాశక్తి-నగరి: ఆదానీ లోటు పూడ్చేందుకే వంటగ్యాస్ పెంపుదల చేశారని, పెరిగిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ నగరి నియోజకవర్గ కార్యదర్శి టి. కోదండయ్య, పట్టణ కార్యదర్శి వేలన్, భాషలు డిమాండ్ చేశారు. నగరి మున్సిపాలిటీ పరిధిలోని బస్టాండ్ సర్కిల్ వద్ద ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ దేశంలో వంటగ్యాస్ సిలిండర్ ధర రోజు రోజుకూ పెరుగుతుందే తప్ప తగ్గింది లేదన్నారు. 2014 సంవత్సరంలో రూ.410 ఉన్న గ్యాస్ సిలిండర్ నేడు రూ.1150 లకు తీసుకొచ్చిన ఘనత నరేంద్ర మోడీకే దక్కుతుందని ఘాటుగా విమర్శించారు. బేరల్ రేటు తగ్గినా, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గకపోగా, వంట గ్యాస్ వినియోగదారులు విపరీతంగా పెరగడాన్ని గుర్తించిన నరేంద్ర మోడీ ప్రతిసారీ రూ.50 తగ్గకుండా పెంచుకుంటూ పోవడాన్ని తప్పుపట్టారు. గత ప్రభుత్వాలు వంట గ్యాస్ ధరలను కేవలం రూ.4 లేదా 5 మాత్రమే పెంచేవారని, నరేంద్ర మోడీ మాత్రం కార్పొరేట్ కనుసన్నల్లో వాళ్ళ మెప్పు పొందే పద్ధతుల్లో ప్రతిసారీ రూ.50 తక్కువ లేకుండా పెంచడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. మహిళా అభ్యున్నతే బిజెపి అభ్యున్నత అని చెప్పి ప్రగల్భాలు పలికే మోడీ మహిళల కంట కన్నీరు తీసుకొస్తున్నాడని వారు ఆవేదన చెందారు. నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో వాటిని కొనలేక, తినలేక బాధలు పడుతుంటే, గ్యాస్ సిలిండర్ ధరలను పెంచి మహిళలపై మోయలేని భారాన్ని నెత్తిన పెడుతున్నాడని మండిపడ్డారు. అత్యధిక శాతం మహిళా ఓటర్లతో గద్దెక్కిన అన్ని ప్రభుత్వాలు మహిళల పట్ల చిన్నచూపు చూడడం మంచిది కాదన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో మోడీ ప్రభుత్వాన్ని మహిళలు గద్దె దింపుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వేలన్ భాష, విజయ్ కుమార్, శేఖర్, సతీష్, బుజ్జీ, ప్రజా సంఘాల నాయకులు సత్తార్, అహ్మద్, అలీ, ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు

లోకేష్ వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి



ప్రజాశక్తి-పుంగనూరు: మీ పార్టీలోని వారు రాసిచ్చిన స్క్రిప్టును చదవకుండా వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని టిడిపి జాతీయ కార్యదర్శి లోకేష్ చేసిన ఆరోపణలపై వైసీపీ నాయకులు ఘాటుగా స్పందించారు. యువగలం పాదయాత్ర సందర్భంగా పులిచెర్ల మండలంలో బహిరంగ సభలో మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై చేసిన ఆరోపణలు పుంగనూరు జెఎండి కళ్యాణ మండపంలో శనివారం వైసీపీ నాయకులు విలేకరుల సమావేశంలో ఖండించారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, జెడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ పెద్దిరెడ్డి, మండల అధ్యక్షుడు అక్కిసాని భాస్కర్ రెడ్డిలు మాట్లాడుతూ లోకేష్ బాబుకు వాస్తవాలు తెలియవన్నారు. మీ పిట్ట కథలతో పాదయాత్రలు జరుపుకోవాలన్నారు. మీ తాత నందమూరి తారక రామారావుకు పొడిచిన వెన్నుపోటును ప్రజలకు తెలపాలన్నారు. భూ కబ్జాదారులు ఎర్రచందన స్మగ్లర్లను పక్కన పెట్టుకుని మీకు రాసిచ్చిన స్క్రిప్ట్ లో చెప్పలేదా లోకేష్ బాబు అంటూ ప్రశ్నించారు. ఎవరు భూకబ్జాదారులు, ఎవరు ఎర్రచందనం స్మగ్లర్లు మీ పచ్చ మీడియాలో రాసింది తెలియదా అన్నారు. తెలిసి తెలియక చంటి పిల్లాడు లాగా అవాస్తవాలు మాట్లాడుతున్నావు మా అభివద్ధి పాదయాత్రలో మీ కంటికి కనబడలేదా అన్నారు. మా నాయకుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మాట్లాడే అర్హత నీకు లేదని లోకజ్ఞానం లేని నీకు లోకమంతా పప్పు అంటున్నారే ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. పుంగనూరు నియోజకవర్గ పరిశీలకుడు జింక వెంకటా చలపతి , వైసీపీ రూరల్ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, ఆర్టీసీ వైయస్సార్ మజ్దూర్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు జయరామిరెడ్డి, మాజీ ఏఎంసీ ఛైర్మన్ అమర్‌నాథ్ రెడ్డి, నాయకులు చెంగారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రమణ పాల్గొన్నారు.

పంచాయతీ పన్నుల బిల్లుల్లో జాప్యం



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: పంచాయతీ పనుల బిల్లుల్లో జాప్యం చేస్తున్నారని గొల్లపల్లి సర్పంచ్ కోక జయప్రకాష్ నాయుడు ఆరోపించారు. శనివారం మండల కార్యాలయంలో మండల సర్వసభ సమావేశం ఎంపీపీ అమరావతి ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పూతలపట్టు శాసనసభ్యులు ఎంఎస్ బాబు పాల్గొన్నారు. మండలంలో జరుగుతున్న అభివద్ధి పనులపై మండల అధికారులు నివేదికలు సమర్పించారు. దీనిపై 170 గొల్లపల్లి సర్పంచ్ కోకా ప్రకాష్ నాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టిన తాగునీరు, మురికి కాలవల వ్యర్థాలు తొలగింపు, వీధిలైట్ల మరమ్మత్తులు చేపట్టిన పనులకు బిల్లులు మంజూరు కాలేదన్నారు. దీంతో సర్పంచులు సొంత నిధులతో ఖర్చులు భరిస్తున్నారన్నారు. గ్రామ ప్రజాప్రతినిధులుగా ఎన్నుకున్నందుకు ప్రజలకు తగు న్యాయం చేయలేక అష్ట కష్టాలు పడుతున్నారన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివద్ధి సర్పంచ్‌లతో సాధ్యమన్నారు. ప్రస్తుతం సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలుగా తయారవుతున్నారని మండల సర్వ సమావేశంలో దీనిపై చర్చించి గ్రామాల అభివద్ధికి నిధులు కేటాయించాలని ఆరోపించారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి గ్రామాల అభివద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తుందన్నారు. వాటితో గ్రామాల అభివద్ధి చేసుకోవాలన్నారు. అనంతరం పలు సమస్యలపై అధికారులను నిలదీయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పాలకూరి రామచంద్రా రెడ్డి, వైస్ ఎంపీపీలు శిరీష్ రెడ్డి, జయకుమార్, జడ్పిటిసి సోమశేఖర్, సింగిల్ విండో ఛైర్మన్ దత్తాత్రేయ రెడ్డి, ఎఎంసి ఛైర్మన్ నాదె సోమశేఖర్, తహశీల్దార్ బెన్ రాజ్, ఎంఈఓ నాగేశ్వరరావు, ఏఈలు గుణశేఖర్ రెడ్డి, శ్రీధర్, కిషోర్ కుమార్, రామిరెడ్డి, తనిఖీవేలు సర్పంచులు ఉమాదేవి, వాణి ప్రియ, సుబ్రహ్మణ్యం, శ్రీహరి పలువురు మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సహకార బంధు పథకాన్ని వినియోగించుకోండి



ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్య సంస్థ, సహకార కేంద్ర బ్యాంకు కలిసి ప్రవేశపెట్టిన సహకార బంధు పథకాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని గంగాధర నెల్లూరు డిసిసిబి బ్రాంచ్ మేనేజర్ ఎం.మహేష్ పిలుపునిచ్చారు. శనివారం బ్యాంకు ఆవరణలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డిసిసిబిలో డిపాజిట్‌కు 7.25 శాతం వడ్డీ ఇస్తున్నట్లు, ఆ వడ్డీ 555 రోజులకే అందిస్తున్నట్లు, సీనియర్ సిటిజన్స్‌కు 8 శాతం ఇస్తున్నట్లు తెలిపారు. సహకార బంధు డిపాజిట్ల సేకరణ మార్చి 1 నుండి 20వతేది వరకే ప్రజల నుండి స్వీకరిస్తున్నామన్నారు. రీ ఇన్వెస్ట్‌మెంట్ డిపాజిట్లకు వడ్డీ 7.70 శాతంగాను, అలాగే సీనియర్ సిటిజన్స్‌కు 8.54 శాతం వడ్డీని అందించనున్నట్లు చెప్పారు. డిసిసిబిలో పొదుపు చేస్తే ఇతర జాతీయ బ్యాంకుల కంటే అదనంగా వడ్డీ వస్తుందని పేర్కొన్నారు. డిపాజిట్లకు డిఐసిజిసి ఇన్సూరెన్స్ భద్రత ఉన్నట్లు తెలిపారు.

న్యాయ సేవలందించేందుకే పారా లీగల్ వాలంటీర్లు



ప్రజాశక్తి-నగరి: న్యాయసేవలను ప్రజలకు చేరువ చేసేందుకే పారా లీగల్ వాలంటీర్లు నియమించినట్లు జ్యూడిషియన్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎస్ విష్ణువర్మ అన్నారు. శనివారం నూతనంగా ఎంపిక చేసిన పారా లీగల్ వాలంటీర్లతో ఆయన సమావేశమయ్యారు. వారికి విధులు, బాధ్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు న్యాయ సేవలకు మధ్య ఉన్న ఖాళీని పూరించే మీడియేటర్లుగా పారా లీగల్ వాలంటీర్లు పనిచేయాల్సి ఉంటుందన్నారు. జీతాలు ఉండవనే సేవాభావంతో పనిచేయాల్సి ఉంటుందన్నారు. 10వ తరగతి పాసై, ఎలాంటి వివాదాలు, సమస్యల్లో లేనివారినే పారా లీగలర్ వాలంటీర్లుగా తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం రామ శాంతి, సీనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండల కేంద్రంలో పూతలపట్టు శాసనసభ్యులు ఎంఎస్ బాబు పుట్టిన రోజు వేడుకలు జడ్పిటిసి సోమశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పెద్ద కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. అనంతరం అభిమానులు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పాలకూర రామచంద్ర రెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, జైకుమార్, పలువురు సర్పంచులు, ఎమ్మెల్యే అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



ప్రజాశక్తి-కార్వేటినగరం: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని జిల్లా కామన్ ఎగ్జామినేషన్ కార్యదర్శి కే. హేమారెడ్డి అన్నారు. శనివారం వార్షిక క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని కత్తెరపల్లి ఉన్నత పాఠశాల ఆవరణంలో క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని అన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలగడంతో పాటు ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. అనంతరం క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 4 రోజుల పాటు జరిగే క్రీడల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిన్ ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు ఈ మురళీకష్ణ, ఉపాధ్యాయులు వాసుదేవరెడ్డి, విశ్వనాథ్, నారాయణ, మోహనమురళీ, సుజల, చలపతిరావు, శ్రీనివాసులు, భీమారావు, శేఖర్, ఆక్కారిబాబు, తిరుమలేశం, మధు, హరిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చేపల చెరువుల వేలం

ప్రజాశక్తి-సోమల: మండలంలోని నంజంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని రెండు చేపల చెరువులకు వేలంను 6వ తేదీ సచివాలయంలో నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సబిత తెలిపారు. సోమప్ప చెరువు, శ్రీకష్ణ జన్మకుంటలకు ఉదయం 11 గంటలకు సచివాలయంలో పంచాయతీ కార్యాలయ నియమ నిబంధనలకు లోబడి డిపాజిట్ చెల్లించిన వారు వేలంలో పాల్గొనవచ్చని వారు తెలిపారు.

అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



ప్రజాశక్తి-సోమల: ప్రజల నుండి వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఎంపీడీవో నాగరాజు సచివాలయ సిబ్బందికి సూచించారు. ఇరికిపెంట గ్రామ సచివాలయాన్ని ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, సిబ్బంది హాజరును పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. అనంతరం జగనన్న లేఔట్ లోని గహ నిర్మాణాలను పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణాలు చేపట్టాలని, బిల్లుల సమస్యలు ఏమైనా ఉంటే తన దష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారం చేస్తానని లబ్దిదారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మేనక సిబ్బంది పాల్గొన్నారు.

ఫోటో: రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



ప్రజాశక్తి-గుడిపల్లి: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని పశువులకు ప్రతి ఏడాది అందించే గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు అందిస్తున్నట్లు వెటర్నరీ అసిస్టెంట్ రవికుమార్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మిట్టూరు, బిజీగానపల్లి, గుడిపల్లి గ్రామంలో నివారణ టీకాలు అందించినట్లు ఆయన తెలిపారు. గాలికుంటు నివారణ టీకాలు కావల్సిన వారు వెటర్నరీ హాస్పిటల్ ను సంప్రదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గుడిపల్లి మండల స్థానిక సర్పంచ్ చంద్రయన్, రైతులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



ప్రజాశక్తి-వి.కోట: మండల పరిధిలోని కొంగాటం పంచాయతీ పడిగల కుప్పానికి చెందిన రఘునాథరెడ్డి భార్య విమలమ్మ (55) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలు.. మృతురాలి తండ్రి కష్టారెడ్డికి నలుగురు కూతుర్లు. అతడికి కొడుకులు లేనందున విమలమ్మ పుట్టింట్లోనే ఉండేది. మూడు సంవత్సరాల క్రితం తండ్రి చనిపోయాడు. దీంతో ఆస్తి మొత్తం విమలమ్మ పేరుతో ఉండడంతో మిగిలిన ముగ్గురు అక్కా చెల్లెళ్లు విమలమ్మతో ఆస్తి విషయంపై గొడవలు పడేవారు. మూడు రోజుల క్రితం అక్కా చెల్లెళ్ళు వచ్చి విమలమ్మతో గొడవ పడడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అనారోగ్యంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందింది.

పంచాయతీ కన్వీనర్‌పై దాడి



ప్రజాశక్తి-గంగవరం: వైసీపీ పంచాయతీ కన్వీనర్ ఆనంద స్వామిపై కత్తితో దాడి చేసిన ఘటన మండలంలోని కీలపల్లిలో శనివారం చోటుచేసుకుంది. సంఘమిత్రను మార్చే విషయమై గొడవ తలెత్తినట్లు తెలిసింది. ఆనందస్వామిపై కొంతమంది సొంత పార్టీ నేతలు కత్తితో దాడి చేశారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. గాయపడిన వ్యక్తిని హుటాహుటిన పలమనేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం బెంగుళూరుకు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి-సోమల: మండలంలోని 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీ గురికానివారి పల్లి గ్రామానికి చెందిన బి హరినాథ్ అనే వ్యక్తి నాటు సారా అమ్ముతున్నాడన్న సమాచారం పోలీసులకు అందింది. దీంతో శనివారం పోలీసు సిబ్బంది దాడి చేసి అతని వద్ద నుండి 50 ప్యాకెట్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, రిమాండ్ నిమిత్తం పుంగునూరు కోర్టుకు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

తాయమ్మకు నాయకుల నివాళి



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని నెల్లిపట్ల పంచాయతీ వైసీపీ కన్వీనర్ అమర నారాయణ అమ్మ తాయమ్మ శనివారం మతి చెందింది. విషయం తెలుసుకున్న రాష్ట్ర వైసీపీ కార్యదర్శి, రాజంపేట పరిశీలకులు కష్ణమూర్తి తాయమ్మ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన సంతాపాన్ని తెలిపారు. వైస్ ఎంపీపీ జయకుమార్, ధర్మపురి సర్పంచ్ బాలప్ప, ఆలపల్లి సర్పంచ్ రమణారెడ్డి, బాబురెడ్డి, బాలకష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాగులో మెళకువలు పాటించాలి



ప్రజాశక్తి-పాలసముద్రం: మండల పరిధిలోని రైతన్నలు వేరుశనగ సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని డిఆర్‌సి వ్యవసాయ సంచాలకులు వేణు గోపాల్, టీవీ నాగపద్మనీ తెలిపారు. శనివారం వెంగళ రాజు కుప్పం గ్రామంలో రైతు సాగు చేసిన వేరుశనగ పంటను వారు పరిశీలించారు. అనంతరం రైతులతో నాగపద్మనీ మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు తక్కువగా వాడటం వల్ల భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. వేరుశనగ కోత, నిల్వలు, కత్తెర పురుగుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. చెరుకును బిందు సేద్యం పద్ధతిలో పంట సాగు చేసుకోవచ్చని తెలిపారు. డ్రిప్ సీడర్ పద్ధతిలో వరి పంట సాగు చేసుకుంటే అధిక లాభాలు పొందవచ్చని, కూలీలు కూడా తక్కువ అవసరమవుతారన్నారు. వరిలో ఆకు ముడత, కాండము తాచుపురుగు నివారణ చర్యలపై రైతులకు క్లుప్తంగా వివరించారు. ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలంలోని మంగుంట గ్రామంలో వెలిసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి 8వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు వెంకటాచలం అయ్య తెలిపారు. శనివారం ఉదయం 6 గంటలకు సుప్రభాతం, అభిషేకం, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం జరిగింది. ఉదయం 9 గంటల నుంచి యాగశాల ప్రవేశం, ఆరాధన, గణపతి పూజ, రక్షాబంధన తదితర కార్యక్రమాలు నిర్వహించారు.